క్లుప్తంగా

కొనసాగుతున్న వెల్లటూరు చానల్ పూడికతీత పనులు



భట్టిప్రోలు: మండలంలోని వెల్లటూరు చానల్ కాల్వ పూడిక తీత, కట్టల మరమ్మతులు చేసే పనులు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కాల్వల పూడిక తీత పనులు, కట్టలు మరమ్మతులు చేపట్టకపోవడంతో మురుగు కాల్వలు పూడుకుపోయి సాగు నీరు అందక, అధిక వర్షాలకు నీరు బయటకు వెళ్లే మార్గం లేక పంట పొలాలు నీట మునిగి దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో డీసీ అధ్యక్షులు యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాల్వ పూడిక తీత పనులు నిర్వహిస్తున్నారు. కాల్వ పూడిక తీతలు నిర్వహించినప్పటికీ కాల్వ కట్టలు దిగజారకుండా పటిష్టం చేయాలని కాల్వ కట్టల గృహ వాసులు కోరుతున్నారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదు

ఎస్ఐ శివకుమార్ యాదవ్



చందోలు(కర్లపాలెం): పాఠశాలల సమీపంలో వ్యాపారులు పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదని చందోలు ఎస్ఐ ఎంవీ శివకుమార్ యాదవ్ చెప్పారు. గురువారం చందోలు గ్రామంలోని పాఠశాలలకు 100 మీటర్లలోపు ఉన్న దుకాణాలు, బడ్డీ కొట్లలో ఎస్ఐ శివకుమార్ యాదవ్ తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు 100 మీటర్లలోపు ఉన్న వ్యాపారస్తులు తమ దుకాణాలలో పాన్‌పరాగ్, గుట్కా, సిగరెట్లు, బీడీలు, గంజాయి, పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శాకంబరి ఉత్సవాలు



రేపల్లె: ఆషాడ పౌర్ణమి సందర్భంగా గ్రామ దేవత బూరుగలమ్మ అమ్మవారి దేవాలయంలో గురువారం ఆలయ అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ ఆధ్వర్యంలో శాకంబరి దేవి ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకుని పసుపు, కుంకుమ, పువ్వులు, పండ్లు, నూతన వస్త్రాలతో పాటు కూరగాయలు, సద్ది నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: స్థానిక రామలింగేశ్వరపేటలో చోరీ జరిగింది. తాళం వేసివున్న ఇంటి తలుపులు పగలగొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం బ్రాహ్మణ వీధికి చెందిన ఎం.ఫణి ప్రసాద్ తండ్రి ఇటీవల మరణించగా, తల్లిని నిద్ర నిమిత్తం విజయవాడ బంధువుల ఇంటికి పంపించారు. ఫణి ప్రసాద్ కూడా తన వ్యక్తిగత పనుల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాడు. ఇంటికి తాళం తీసి ఉండటంతో గురువారం ఉదయం గమనించిన స్థానికులు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్లుగా ఫణి ప్రసాద్‌కు సమాచారం ఇవ్వడంతో, అతను వచ్చి పరిశీలించి చోరీ జరిగినట్లుగా నిర్ధారణకు వచ్చాడు. బంగారం, నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీమా సౌకర్యాన్ని రైతులు పొందాలి

తెనాలి: మండలంలోని రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద వరి, మినుము పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.సుధీర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 31వ తేదీలోగా రైతు సేవాకేంద్రాలు లేదా బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించి బీమా రక్షణ పొందాలని సూచించారు. వరి పంటకు ఎకరాకు రూ.800, మినుముకు రూ.200 చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రైనేజీలు అధ్వానం..
క్షీణిస్తున్న పారిశుద్ధ్యం

- డ్రెయిన్‌లు పూడుకుపోవడంతో పారని మురుగు
- వార్డుల్లో లేని పూడికతీతలు
- పొంచి ఉన్న అంటువ్యాధుల ప్రమాదం

రేపల్లె: పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో పట్టణ ప్రజలకు తిప్పలు తప్పటం లేదు. పారిశుద్ధ్యాన్ని నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటంతో పలు వార్డులలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో పట్టణంలో మురుగునీటి పారుదలకు ఆటంకం ఏర్పడి పలు చోట్ల డ్రెయిన్‌లు పూడుకుపోవటంతో మురుగు రహదారులపై పారుతోంది.

పూడుకుపోయిన డ్రెయిన్‌లు

డ్రెయిన్‌లలో చెత్త చెదారంతో పూడుకుపోవటం ఒక ఎత్తయితే, కొంత మంది పారిశుద్ధ్య సిబ్బంది రహదారులు ఊడ్చే సమయంలో ఆ చెత్తను నేరుగా డ్రెయిన్‌లలోకి నెట్టటంతో కాల్వలు పూడుకుపోతున్నాయి. డ్రెయిన్‌లలో కనీసం మురుగునీరు పారుదల లేకపోవటంతో ఆ నీరు రహదారులపైకి చేరుతోంది. దీంతో పాటుగా పలు వార్డులలో పక్కా గృహాల నిర్మాణం కోసం అవసరమైన ముడి సరుకులను తోలించుకునేందుకు మురుగు కాల్వలను పూడ్చివేస్తున్నారు. ఆయా ప్రాంతాలలో మురుగునీరు పారుదల కాకపోవటంతో రహదారులపై చేరుతోంది. రోజుల తరబడి రహదారులపై మురుగునీరు నిలబడటంతో పారిశుద్ధ్యం క్షీణించి అంటువ్యాధులు ప్రబల్లే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా పాదచారులు, వాహన చోదకులు సైతం ఈ రహదారులలో వెళ్లాలంటే అసహనం వ్యక్తం చేస్తున్నారు.



నేతాజీ నగర్ వద్ద వాడమురుగు డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్త చెదారం



అంబేద్కర్ పార్కు పక్కన డ్రెయిన్‌లో పేరుకుపోయిన చెత్త



23వ వార్డులో పూడుకుపోయిన డ్రెయిన్

వార్డులలో లేని పూడికతీతలు

పట్టణంలోని ప్రధాన రహదారుల పక్కన ఉన్న డ్రెయిన్‌లలో మాత్రమే పూడిక తీస్తున్నారు. వార్డులలోని డ్రెయిన్‌లలో పూడికలు తీయించటంలో మున్సిపల్ అధికారులు సైతం మమ అనిపిస్తున్నారు. పట్టణంలోని 3, 4, 5, 6, 7, 22, 23, 24, 25 వార్డులలో డ్రెయిన్‌లు పలుచోట్ల పూడుకుపోయి దర్శనమిస్తున్నాయి. ఆయా వార్డులలోనే పలువురు భవన నిర్మాణాల కోసం కొన్ని రోజులు క్రితం పూడ్చిన డ్రెయిన్‌లు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయిన్‌లో పూడికలు తీయించటంతో పాటు మురుగునీరు పారుదలకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

దోమల దండయాత్ర

పట్టణంలో దోమల దండయాత్రతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా దోమలు హడలెత్తిస్తున్నాయి. సాయంత్రం వేళ ప్రశాంతంగా ఆరుబయట కూర్చునే పరిస్థితులు లేవు. మురుగు కాలవల్లో రోజులు తరబడి మురుగునీరు పేరుకుపోవడంతో దోమల వృద్ధి అధికంగా ఉంది. దీంతోపాటు దోమల నివారణకు చేపడుతున్న ఫాగింగ్ కార్యక్రమాలు తూతూ మంత్రంగానే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పట్టణంలో పారిశుద్ధ్యం లోపించకుండా నిత్యం పర్యవేక్షిస్తున్నాం. పలు వార్డులలో ఉన్న మురుగు కాలువల్లో సైతం నిత్యం పూడికలు తీసేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు సహకారం అందించాలి. కాలవల్లో చెత్త చెదారాలను పడవేయరాదు.

– మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

వైభవంగా గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు



రేపల్లె రామకోటిపేటలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



రేపల్లె రామకోటిపేటలో అన్నసంతర్పణలో భక్తులు



మాట్లాడుతున్న ఎస్ఎస్‌పీ జిల్లా ధర్మ ప్రచారక్ హేమశంకరరావు

రేపల్లె: ఆషాడ శుద్ధపౌర్ణమిని పురస్కరించుకుని గురుపౌర్ణమి పర్వదినాన్ని గురువారం పట్టణ, మండలంలోని వివిధ సాయినాథుని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే సాయినాథుని విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయినాథునికి అన్నాభిషేకం, హోమాలు నిర్వహించారు. చినకూరగాయల మార్కెట్ సెంటరు, రామకోటిపేట, ఇసుకపల్లిలలోని సాయిబాబా ఆలయాలతో పాటు కారుమూరు, మైనేనివారిపాలెం, పేటేరు, బావాజీతోటలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బాబావారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

చిన్న వయస్సు నుంచే భక్తిని పెంపొందించుకోవాలి

రేపల్లె: చిన్న వయస్సు నుంచే భగవంతుని పట్ల భక్తి, పెద్దల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు చెప్పారు. వ్యాస పౌర్ణమిని పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీవాణి సహకారంతో కొత్తపాలెం రామాలయం, జిల్లేపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, గుళ్ళపల్లి రామాలయాలలో గురువారం బాల వికాస్ కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. బాలబాలికలలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, సభ్యులు కొల్లూరు సుజాత, బండారు సుబ్బరాజు, రమేష్, సుబ్రహ్మణ్యం, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం కర్లపాలెంలోని సత్యసాయి గ్రామీణ సేవా సమితిలో షిరిడీ సాయిబాబా విగ్రహానికి, సత్యసాయి చిత్రపటాలకు భక్తులు పూజలు నిర్వహించారు. గణపవరం, యాజలి గ్రామాలలో ఉన్న సాయి ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రామకృష్ణ సేవా సమితిలో విశేష పూజలు జరిగాయి. గురుపౌర్ణమి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు పేరాల వెంకట సురేష్ దంపతుల ఆధ్వర్యంలో సాయిబాబా దేవాలయాల్లో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమాలలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నగరంలో...

నగరం: గురుపౌర్ణమి పర్వదినాన్ని గురువారం మండలంలోని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ఈదుపల్లి శివారు సాయినగర్‌లోని షిర్డి సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే ఆలయంలో బాబావారికి విశేష పూజలు చేశారు. వేదపండితులు మేలుకొలుపు, కాగడహారతి, అభిషేకాలు, సాయిదత్త హోమం శాస్త్రయుక్తంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. బాబా వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా ధూళిపూడిలోని షిర్డి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: బాలబాలికలు సృజనాత్మక శక్తిని వెలికితీసే బాల వికాస్ కేంద్రాలను టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన భట్టిప్రోలు పరిధిలోని అద్దేపల్లి రామాంజనేయనగర్ ఎస్టీ కాలనీలోని కోదండ రామాలయంలో గురుపౌర్ణమి సందర్భంగా గురువారం ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు బండారు కుమారి శ్రీనివాసరావు దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, పరియోజన్ ప్రముఖ్ పడమటి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, పసుపులేటి శ్రీలక్ష్మి ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, బాల వికాస్ మాతాజీ వేల్పూరి అనసూర్య పాల్గొన్నారు. వ్యాస పౌర్ణమి పురస్కరించుకుని దత్తాత్రేయుని గురు దత్తగా పూజించాలని ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. మండలంలోని వెల్లటూరులో గురువారం గురుపౌర్ణమిని నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు క్రాప రవికుమార్, గోగినేని శేఖర్ తదితరులు పాల్గొన్నారు. సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా వ్యాస మహర్షికి పూజలు నిర్వహించారు. ఈ నెల 6న ప్రారంభమైన చాతుర్మాస్య వ్రత దీక్ష నవంబర్ ఒకటో తేదీ వరకు జరగనుంది. కార్యక్రమ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వెల్లటూరు శంకరమఠంలో

మండలంలోని వెల్లటూరు శంకరమఠంలో వేంచేసిన ఆదిశంకరాచార్యుల వారికి ఘనంగా అలంకరణ నిర్వహించారు. అలాగే శారదాంబ అమ్మవారిని ఆషాడ పౌర్ణమి సందర్భంగా గ్రామం సుభిక్షంగా ఉండాలని గురువారం అమ్మవారి మూలవిరాట్‌కు కూరగాయలతో శాకాంబరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు క్రోవి శ్రీరామచంద్రమూర్తి (చందూ మాస్టార్) అమ్మవారిని శాకాంబరి దేవిగా అలంకరించిన తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామంలో పాడి పంటలు పుష్కలంగా పండి.. సంతోషంగా ఉండాలని, వృత్తి, వ్యాపారాలు బాగుండాలని, ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.



కర్లపాలెంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



భట్టిప్రోలులో గురుపౌర్ణమి పూజలు



ఈదుపల్లి సాయినగర్‌లో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

బాపట్లలో...

బాపట్ల: బాపట్లలోని షిరిడి సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజలు గురువారం ఘనంగా జరిగాయి. భక్తిశ్రద్ధలతో గురుదేవుని సన్నిధిలో గడిపిన భక్తజనం భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. బాపట్ల పరిసర ప్రాంతాల ప్రజానీకానికి కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా కొలువుదీరిన సాయిబాబా ఆలయానికి గురు పూర్ణిమ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక దివ్య అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. సుమారు 5 వేల మందికి పైగా భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.



బాపట్లలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

క్షయ వ్యాధిని సమూలంగా రూపుమాపాలి

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



బాపట్ల: క్షయ వ్యాధిని సమూలంగా రూపుమాపాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. గురువారం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సరస్వతీ మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో టీబీ నిర్మూలన ప్రచార గోడ ప్రతులను నరేంద్ర వర్మ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ క్షయ నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. టీబీ రహిత దేశంగా చేయాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ వ్యాధికి ఉచిత చికిత్స అందిస్తున్నాయన్నారు. ఈ వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడంతో చాలామంది వ్యాధి బారినపడి ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నివారణ అధికారి, వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ప్రముఖులకు సత్కారం



తెనాలిరూరల్: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు ప్రముఖులను సత్కరించారు. పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్‌ఫిజీషియన్ డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వేజళ్ల ఉమామహేశ్వర్, అయినాల మల్లేశ్వరరావు, మాజీ సైనికుడు తాతా పోతురాజు, ప్రముఖ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావులను పార్టీ నాయకులు గురువారం సత్కరించి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలను ప్రశంసించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవనాయుడు, అడపా సంపత్‌రాయుడు, మండల అధ్యక్షుడు కడియాల నంద కిషోర్, తెనాలి మూడవ పట్టణ అధ్యక్షుడు యర్రంరాజు సందీప్, రెండవ పట్టణ ఇంచార్జ్ శిఖా రవీంద్ర, జిల్లా అధికార ప్రతినిధి తమరిసి అనంతచార్యులు, మైలా హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని అందిపుచ్చుకోండి

ప్రధానోపాధ్యాయుడు పి.అప్పారావు



కొల్లిపర: విద్యార్థులు దాతల సహకారాన్ని అంది పుచ్చుకొని చదువులో బాగా రాణించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.అప్పారావు అన్నారు. మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శ్రీనివాస ఫౌండేషన్ అధ్యక్షుడు మిరియాల యాకోబు ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు డైరీలు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస ఫౌండేషన్ అధ్యక్షుడు యాకోబు మాట్లాడుతూ ఫౌండేషన్ పేద విద్యార్థులకు ఎల్లవేళలా అన్ని విధాల అండదండలుగా ఉంటుందని తెలిపారు. పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ అనంతరం ఫౌండేషన్ తరపున 2024 25 సంవత్సరంలో 10వ తరగతిలో ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ కనబరచాలి

డిప్యూటీ డీఈవో సురేష్

రేపల్లె: తమ చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డిప్యూటీ డీఈవో కేసనశెట్టి సురేష్ అన్నారు. మెగా పేరెంట్స్ సమావేశం సందర్భంగా మండలంలోని నల్లూరుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆయన మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలే కాక తల్లిదండ్రుల ప్రవర్తన, పరిసరాలు పిల్లలపై ప్రభావం చూపుతాయన్నారు. చిన్నారుల పట్ల చూపే శ్రద్ధ వారి బంగారు భవిష్యత్‌కు పునాది అవుతుందని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు సుజాత మధ్యాహ్న భోజనంకు అందించిన 100 ప్లేట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరులో...

కొల్లూరు : విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు పాటుపడాలని మాజీ ఎంపీపీలు కనగాల మధుసూదన్ ప్రసాద్, మైనేని మురళీకృష్ణలు వ్యాఖ్యానించారు. గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో భాగంగా కొల్లూరు బాలురోన్నత, బాలికోన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ చదువులతోపాటు, ఆటపాటలలో సైతం విద్యార్థులు రాణించాలన్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన బాలికోన్నత పాఠశాల విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొల్లూరులో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను సన్మానించిన మాజీ ఎంపీపీ

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలి: ఎంపీడీవో

కర్లపాలెం: ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. గురువారం కర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు ఎంపీడీవో, జెడ్పీటీసీ బహుమతులతో పాటు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పోలీస్‌రావు, విమలమ్మ, లక్ష్మీప్రసన్న, రాజేష్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న డిప్యూటీ డీఈవో సురేష్

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-2.0 లో భాగంగా తల్లిదండ్రులు బడి వరకు నడిపిస్తే బడి మిగిలిన జీవితం అంతా నడిపిస్తుంది.. బడి వైపు ఒక అడుగు, తల్లిదండ్రులతో ముచ్చట్లు, మీ పిల్లల భవిష్యత్తు కోసం మీ సహకారం అవసరం కార్యక్రమం నిర్వహించారు. భట్టిప్రోలు మండలం పెదపులివర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, భట్టిప్రోలు సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీటీసీ సభ్యులు గద్దె సుశీల, ఎస్ఎంసీ చైర్మన్, కమిటీ నిర్వాహకులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఏడుగురు విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయులు వి.వెంకటేశ్వరరావు హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ద్వారా రూ.3 వేలు, సూట్‌కేసులు, అలాగే ఎస్ఐ ఎం.శివయ్య సరిఫికెట్ ఫైల్స్‌ను అందచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వింజమూరి పూర్ణచంద్రరావు, పెసర్లంక సర్పంచ్ వేములపల్లి వెంకటేశ్వరరావు, ఆర్గనైజర్ శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్, కమిటీ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు. ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, హెచ్ఎం మాచర్ల మోహన్‌రావు, పెసర్లంక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు.



విద్యార్థుల తల్లిదండ్రులకు మొక్కలు అందిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

ఇంటర్మీడియట్ దశ అత్యంత ముఖ్యం

తెనాలిటౌన్: ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ అత్యంత ప్రాముఖ్యమైనదని సెయింట్‌పాల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎంఎ లింకన్‌బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక నాజర్‌పేటలోని సెయింట్ పాల్స్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ నందు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా న్యాయవాది కరీమూన్, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమం నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎంఎ లింకన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని సూచించారు. వృత్తి విద్యాకోర్సుల ద్వారా పిల్లలు భవిష్యత్‌లో కలిగే ఉపాధి అవకాశాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాలసెక్రటరీ ఆర్.షీలా సుజని, అధ్యాపకులు డాక్టర్ స్వేచ్ఛ, కీర్తి, అబ్రహం, ఉష, సురేష్, తదితరులు పాల్గొన్నారు.